# క్రిస్మస్ శుభాకాంక్షలు

చర్చి గంటలు మ్రోగు తున్నాయి.

'చింత లేదిక ఏసు పుట్టెను
వింతగను బెత్లేహమందున
చెంత చేరగ రండి వేగమె
దీనులై సర్వమాన్యులై' పాట వినబడుతూ వుంది.

చర్చి అంతా రంగు కాగితాలతో, బెలూనులతో, చమ్కీ దారాలతో, రంగు రంగుల బల్బులతో, తోరణాలతో, అరటి బోదెలతో, కొబ్బరి మట్టలతో అలంకరింపబడి వుంది.

చర్చి నిండా కిటకిట లాడుతూ జనం. క్రైస్తవులు.

కొత్త బట్టలు, కొత్త అలంకారాలు, కొత్త ఆశలు, కొత్త ఆనందాలు రూపం దిద్దుకొన్న క్రైస్తవులు.

సిలువ ఆకారంలో వున్న దేవాలయంలో క్రీస్తు శిరస్సు మీద ముళ్ళ కిరీటం పెట్టిన చోట వేదిక వుంది. చేతులకు మేకులు కొట్టిన చోట్ల సంగీతం, చర్చి అధికారం కూర్చున్నాయి. సంగీతంలో హార్మోనియం, ఆడపిల్లలు, ఆర్కెస్ట్రా పాటల పుస్తకాల భాగం. అధికారంలో చర్చి పాలక వర్గం, వాళ్ళ సంతానం, వారసులో భాగం. కాళ్ళకు మేకులు కొట్టిన చోట చర్చి ప్రవేశం. అందులోంచి ఏసుప్రభువు రక్తం ప్రాచీన కాలంలో నుంచి వస్తున్నట్టు ఆరకుండా ఆగకుండా వస్తున్న క్రైస్తవులు. ఈ గేటులో నుంచే నగరంలోని క్రైస్తవు లంతా చర్చికి రావటం, పోవటం.

ఫాదిరీ వేదిక మీద పులిపీఠం దగ్గర నిలబడి నక్షత్ర ప్రయాణం వివరించాడు. గొర్రెల కాపరులకు దేవదూత రక్షకుడి జననం గూర్చి తెలపటం విశదీకరించాడు. జ్ఞానులు కాపరులు చేసిన యాత్రలు తెలిపాడు. చలిలో కొండల్లో

నిండు చూలాలు అష్టకష్టాలు పడి బెత్లెహెం చేరటం చెప్పాడు. హేరోదు రాజు దుష్ట చింతన పరామర్శించాడు. పశువుల పాకలో జగద్రక్షకుడు పసిపాపగా పండుకొని ఉండటం భావించాడు. ఏసు ఎవరో, క్రీస్తు ఎవరో, క్రైస్తవం ఏమిటో, క్రైస్తవులు ఏం చేయాలో, ఎలా జీవించాలో, భక్తితో, ఆవేదనతో, ఆవేశంతో, ప్రేమతో సూటిగా తీక్షణంగా, తీవ్రంగా, దీక్షగా ప్రవచనం చేస్తున్నాడు.

చర్చిలో క్రైస్తవులు వింటున్నారు.

భక్తి తాదాత్మ్యంతో తలలూపుతున్నారు. ఆసక్తితో చెవులు నిక్కబొడుచుకొని వింటున్నారు. అలంకరణ పరికిస్తున్నారు. బట్టలు, నగలు పరిశీలిస్తున్నారు. దొరికే స్థలమూ తెలుసు కొంటున్నారు. పిన్నవాళ్ళు ఆవులిస్తున్నారు. చాక్‌లెట్‌లు తింటున్నారు. చీరలు దులుపు కొంటున్నారు. చుట్టూ చూస్తున్నారు.

చర్చి మౌనంగా ఉంది.

చుట్టూ ఆలగోలగా బాల గోలగా ఉంది.

భక్తిగా ఉంది. ఉత్సవంగా ఉంది. వేడుకగా ఉంది. వినోదంగా ఉంది. వింతగా ఉంది. బిచ్చగాళ్ళకు చింతగా ఉంది.

'చింత వీడిక ఏసుపుట్టెను.'

పాట చర్చిలో వినపడటం లేదు. చర్చి నుంచి కాంపౌండుగోడ గేటు దాకా రెండు పక్కలా మహారాజుకు వంది మాగధులు లాగా, రోడ్డుకు ఫుట్‌పాత్‌స్ లాగా, మనిషికి కాళ్ళులాగా బారులు తీర్చి కూర్చున్న బిచ్చగాళ్లు పాడుతున్నారు.

చర్చిలో ఉపన్యాసం సాగుతూంది.

ఎడం ప్రక్కన సంగీత సామ్రాజ్యం వైపు చూస్తు మకుటంలేని మహారాజులాగా కూర్చున్న మహాత్ముడు ఏసురాం.

ఏసురాం పేరు ఎవరు పెట్టారో కాని పేరే పెద్ద విశేషం.

అది క్రైస్తవ హిందూ మత సంప్రదాయాల సంరక్షణ రూపం.

అది పాశ్చాత్య ప్రాచ్య భాషా ధర్మ సమన్వయ దీప్తి.

ఏసురాం పేరుకు మాత్రమే గొప్ప వ్యక్తి కాడు. జీవితం ఇంకా విశేష మయింది.

చర్చికి పోతాడు. బైబిల్ సూక్తులు వింటాడు. గుడికి పోతాడు. పూజ చేయిస్తాడు. మసీదుకు వెళతాడు. నమాజు చేస్తాడు.

ఎవరూ అతన్ని ఆటంక పరచరు. అందరూ అతన్ని ఆహ్వానిస్తారు. నగరంలో అతడికున్నంత పేరు ప్రఖ్యాతులు మరెవరికి లేవంటే ఆశ్చర్యం లేదు.

అతడో శక్తి, వ్యక్తి కాదు, వ్యవస్థ. అంతే కాదు. అతడు సర్వ మత సమన్వయ శీలి. తానే అన్ని మతాలు, అన్ని మతాలు తానే.

"నువ్వెవరివి"

"క్రైస్తవుణ్ణి"

"నువ్వెవరివి"

"భారతీయుణ్ణి"

"నువ్వెవరివి"

"విశ్వ మానవుణ్ణి"

అవీ ఏసు రాం సమాధానాలు.

అతడికున్నంత ఆస్తి ఆ ఊళ్ళో ఎవ్వరికి లేకపోవడంతోనే అతని గొప్పతనం. అంతే కాదు.

అతడికున్నంత మంది పిల్లలు ఆ వూళ్ళో ఎవ్వరికి లేరు. అంత మాత్రాన అతడికి ఆధిక్యం రాలేదు.

అతడి పిల్లలు ప్రపంచంలో ఎన్నో దేశాలలో వున్నారు. అన్ని దేశాలలో తన సంతానాన్ని చూచుకొనే అదృష్టం మాత్రమే అతడికి గొప్పతనం తెచ్చి పెట్టలేదు.

ఆ పిల్లలు చదివిన చదువులు, చేసే ఉద్యోగాలు, ఉన్న సంబంధాలు, వచ్చే సంపదలు ఇలా అని చెప్పటానికి వీలు లేకపోవటం నుంచి అతడికి ప్రత్యేక గౌరవం రాదు.

ఎవరో అనటం కద్దు. ఏసురాం తలచుకొంటే నగరాన్ని కొనేయగలడని.

నిజమెంతో అబద్ధమెంతో కానీ, అతడెప్పుడు నగరాన్ని బేరమాడలేదు. కానీ ఫ్యాక్టరీలు స్థాపించాడు. ఇళ్ళు కట్టించాడు. పొలాలు కొన్నాడు. ఒక కదిలే బ్యాంకు లాగా వుంటాడు. జేబులో చిల్లి గవ్వ వుండని బిచ్చగాడు లావుంటాడు. బిచ్చగాడికయినా చిల్లి గవ్వలు, చెల్లు గవ్వలు, చిల్లర డబ్బులుంటాయి.

రామ రామ ఏసురాం దగ్గర పొట్ట పొడిస్తే అక్షరం ముక్క లేనట్లే జేబు కొడితే పైసా దొరకదు.

ఎందువల్ల?

ఇప్పుడుండీ లేనివాడు కావటం వల్ల.

అప్పుడు లేకపోవటం వల్ల.

ఆ రోజుల్లో తాను చాలా చిన్నవాడు.

చిన్నతనం వయస్సుసకు సంబంధించింది. డబ్బుకు సంబంధించింది. ఇంకా అధికారానికి, అర్హతకు, అంతస్తుకు, పలుకుబడికి, ప్రాపుకు సంబంధించింది.

అప్పుడు దూడలు కాచుకొన్నాడు

నాగలి పట్టుకొన్నాడు.

తలగుడ్డ చుట్టుకొన్నాడు.

తెల్లదొరల దగ్గర చేరాడు. వాళ్ళ దగ్గర అక్షరాలు తప్ప అన్ని నేర్చుకొన్నాడు.

ఇంగ్లీషు మాట్లాడుతూవుంటే దొరలకు తలకాయ కొట్టేసినట్లుండేది.

చాలా దేశాలు తిరిగాడు.

ఏసురాంకు చదువురాదని బొటన వేలు ముద్ర వేస్తాడని చూచిన వాళ్ళు కూడా నమ్మరు.

బట్టలు చూచినా, మాటలు విన్నా, తెలివి తేటలు గమనించినా, దేశాలు ఏలే మహారాజే అని నమ్ముతారు.

ప్రసంగం చేసే ఫాదరీ క్షణం క్షణం ఏసురాంని గమనిస్తున్నాడు.

ఏసురాం కంటితో మాట్లాడగలడు.

ఫాదరీ కంటితో వినగలడు.

ప్రసంగం ఆపమంటే ఆపుతాడు.

సాగించమంటే లాగించేస్తాడు.

ఇందువల్ల ఏసురాం మొనగాడై పోలేదు.

మరి ?

నలభై ఏళ్ళ ఏసురాం కార్యదర్శి.

అదేం గొప్ప ?

అవును ! అదే గొప్ప !

అది నిజమే. ప్రధానమంత్రి పదవికాదు. ముఖ్యమంత్రీ కానేకాదు. పోనీ మామూలు మంత్రి వ్యవహారమూ కాదు.

అయితే ఏకగ్రీవంగా అన్నేళ్ళు కార్యదర్శి కావటం మాటలా ?

మిషన్ అంటే ఒక చర్చి కాదు, చాలా చర్చిలు.

మిషన్ అంటే ఒక ఊరు కాదు. ఒక జిల్లా కాదు. చాలా జిల్లాలూ కాదు

రెండు రాష్ట్రాలు కూడ ఈ మిషన్‌లో వున్నాయి.

ఈ క్రైస్తవులందరికి ఏసురాం కార్యదర్శి.

పోటీ లేకుండా గెలిచాడు !

గిట్టని వాళ్ళు లక్ష చెబుతారు. వాళ్ళంతా చర్చిలో కూర్చున్నారు. వాళ్ళి దప్పుడే లేవరు.

ప్రార్థన చేస్తున్నారు.

ప్రసంగం వింటున్నారు. భక్తి పారవశ్యంతో వూగిపోతున్నారు. ఊరు మరచి, వాడ మరచి, పుట్టి పెరిగిన చోటు మరచి, బ్రతుకు బాధ్యత మరచి, భక్తి ప్రవాహంలో కొట్టుకు పోతున్నారు.

ఏదీ కోరుక్కోకుండా, ఏమీ పట్టించుకోకుండా, ఏదీ అక్కర లేకుండా జీవిస్తున్నారు. దేవుణ్ణి సేవిస్తున్నారు.

వాళ్ళు ఆదర్శ క్రైస్తవులు. మాదిరి క్రైస్తవులు. లోకం ఆకలి గొన్నప్పుడు అగ్రెత్తి చూడ్డానికి దొరికే క్రైస్తవులు.

వీళ్ళకి దైవ సామ్రాజ్యం కావలసినంతగా మానవ సామ్రాజ్యం అక్కర లేదు.

దాని కోసం వీళ్ళు సర్వం సమర్పించుకొంటారు.

భక్తి తప్ప ఏమీ పొందరు. ఇల్లు లేదు. పొలం లేదు !

రేపటి గురించి ఆశ లేదు. ఆసక్తి లేదు.

ఏది లభిస్తే అది గ్రహించటం, జీవించటం అంతే ?

వాళ్ళు సుఖంగా వున్నారు. సంతోషంగా వున్నారు. వాటిని చుట్టూ పంచుతున్నారు.

తుదకు మిగిలిందేమీ లేదు. మిగిలేదేమీ లేదు.

ఇటువంటి సద్భక్తులను సంరక్షించే పూచీ ఏసురాంది.

ఏ ఎం. పి. ఎలక్షన్‌లో కూడా ఏసురాం పన్నే యుక్తులు మేం చూడలేదని రాజకీయాలలో తడిసి, నాని, ఎండి బీటలు తీసిన మేధావులు ఒప్పుకొన్నారు.

అందువల్లే దేశ రాజకీయాలలో పోటీ అయినా వుంటుంది.

ఏసురాంకి అదేం లేదు.

కల్లు, సారాయి ఖర్చు ఏ రాజకీయ నాయకుడయినా చేస్తాడట.

స్త్రీలను కూడా ఎలెక్షన్‌లో ఖర్చు చేయడం ఏసురాంకి తెలుసునట.

డబ్బు నదీ ప్రాంతంలో జలంలాగా ఎవరయినా ఖర్చుపెడతారట.

కానీ సముద్ర జలంలాగా ఏసురాం వాడుతాడట.

ప్రతినిధుల్ని ఆహ్వానించటం, బ్రతిమాలటం, బెదరించటం, దాచిపెట్టడం ఎవరైనా చేయగలరట కానీ అవసరమయితే అయిపులేకుండా చేయటం, పత్తా లేకుండా చేయటం, కేసు రాకుండా చూడటం ఏసురాంకు తెలుసునట.

అందుకే నగరంలోని రాజకీయ నాయకులు ఏసురాం ఇంటి వరండాలో పాఠాలు వినటం కోసం పడిగాపులు పడివుంటారు.

ఏసురాం దర్శనమే దైవ దర్శనం, ఉపదేశం గీతోపదేశం.

చర్చిలో ప్రసంగం సాగుతూనేవుంది.

చిలువలు పలువలుగా అల్లుకుపోతూవుంది.

మైక్ లౌడ్‌స్పీకరై లోకం మీద పడి కేకలేస్తూవుంది.

భక్తులు వస్తూవున్నారు.

చర్చి నిండిపోయింది. జనం చుట్టూ వెలుపల నిలబడ్డారు.

ఫాదిరి కనిపించకపోయినా ప్రసంగం వినబడుతూవుంది.

ఉత్సాహం ఊపిరై, ఆనందమై, పిల్లలు ఆడుకొంటున్నారు.

బిచ్చగాళ్ళు అడుక్కొంటున్నారు.

భక్తులు పరవశులవుతున్నారు.

గాలికి భక్తుల ఆనందం సువాసన పంచిపెడుతూవుంది.

కంటికి చర్చి పండుగగావుంది.

క్రిస్మస్ పండుగ పరమానందంగా చర్చిలో ఉపన్యాసంగా సాగుతూ వుంది.

పట్టరాని ఆనందం.

ఏసురాంకి పట్టరాని దుఃఖం.

ఎదురుగా ముందు వరుసలో కూర్చున్న యువకుణ్ణి చూస్తుంటే వళ్ళుమండి పోతూంది.

ఈ మిషన్‌లో ఏ జిల్లావాడో యువకుడు! ఆనందం!

నేను ఆనందాన్ని అంటూ నిన్ననే ఏసురాంని కలుసుకొన్నాడు.

'ఏం?' అన్నాడు ఏసురాం.

'ఎలక్షన్లు' ఆనందం.

'ఏం?'

'ఎం. పి.'

'ఏం ?'

"నువ్వైనా నిలబడు, నాకయినా నీ సపోర్టుఇవ్వు !"

'నీకేం బలముంది?'

'నేనే'

ఏసురాం మాట్లాడలేదు. అసలు అతడితో ఎలక్షన్లగూర్చి ప్రస్తావించిన వాడు ఇంతవరకూ లేడు.

ఎక్కడయినా, ఎప్పుడయినా వున్నా ఇలా మాట్లాడినవాడులేడు.

సలహా ఇచ్చినా, సూచన చేసినా, లొంగి, తగ్గి, తలవంచుకొని మాట్లాడిన వాళ్ళే!

ఇలా నువ్వో నేనో అన్నవాడెవడూలేడు.

అందరికీ క్రీస్తు పుట్టుక ఆనందం కలిగిస్తూవుంది.

ఏసురాంకి ఈ ఆనందం పుట్టుక బాధగావుంది.

చర్చిలో అంతా క్రిస్మస్ శిశువును చూస్తున్నారు. తలచుకొంటున్నారు. వింటున్నారు. ఆవులిస్తూవున్నారు.

ఏసురాం ఈ కొత్త యువకుణ్ణి చూస్తున్నాడు. తలుస్తున్నాడు.

వాడెవడో కారునీ, వీడెవడొ స్కూటర్‌నీ ఎందుకు వాడటంలేదని ఏసురాంని అడిగాడు.

'ఏమో' అన్నాడు ఏసురాం పరధ్యానంగా.

'పెట్రోల్' అన్నాడు ఆనందం. 'ధర పెరిగింది' మళ్ళీ చెప్పాడు.

ఏసురాం పరధ్యానం వదలిపోయింది.

'ఆ!' అని సర్దుకొని కూర్చున్నాడు.

"నీకారులోకి పెట్రోలు ఎక్కణ్ణుంచి వస్తుంది."

'పెట్రోలు బంకులోంచి'

'కాదు గల్ఫ్ కంట్రీసునుంచి'

ఏసురాం వెన్నుముకమీద చరచినట్టయింది.

'ఏసుప్రభువున్నట్టి పుట్టి పెరిగి తిరిగి రక్షించి, శిక్షింపబడినచోటునుంచి".

ఏసురాం వెన్నుముక నిచ్చెనక్రింద ఇసుక తొలుచుకుపోతూవుంది.

'క్రీస్తు పుట్టకముందునుంచీ, పుట్టింతర్వాత ఇప్పుడూ ఎప్పుడూ అక్కడ యుద్ధాలే'.

వెన్నుముక జలజల లాడుతూవుంది.

'అక్కడి యుద్ధాలే ఇక్కడి నీ కాలినడకకు కారణం!'

ఏసురాం నడుం విరిగినట్లయింది.

దేశ రాజకీయాలు, ప్రపంచ రాజ్యాల తాషత్రయం, ధరల పెరుగుదల, దేశంలో అరాచకం, ఆందోళనలు, అల్లర్లు, తగలబడటాలు వంటి చాలా విషయాలు మాట్లాడుతున్నాడు ఆనందం.

ఏసురాం చెవి పనిచేయటంలేదు. చూపు ఆనటంలేదు. వొంటిమీద స్పర్శ లేదు. తలకాయ పనిచేయటంలేదు. మొద్దుబారిపోయాడు.

ఒకటే ప్రశ్న.

'ఎవడు వీడు ?'

అరిగిపోయిన గ్రాంఫోను రికార్డు పెడితే వచ్చే ఒకే శబ్దం లాగా 'ఎవడు వీడు'? 'ఎవడు వీడు?' 'ఎవడు వీడు?'

వాడు ఎం.పి.గా నిలబడతాడో, నిలబడడో, ఓడిపోతాడో, పోడో కాని మిషన్ కార్యదర్శి పదవికి పోటీ కారాదు.

ఆ మాట అనుకొన్న దగ్గర్నుంచి ఒకటే వణుకు.

ఆనందం రాక పిడుగు పాటు.

అగ్నిమాపక దళం జట్లు జట్లుగా తలకాయ చుట్టూ తిరుగుతున్నట్లుంది.

నిన్నటి నుంచి ఏసురాంకు వణుకు. ఇప్పుడు ఏసురాం అంటేనే వణుకు ఆ వణుకు చర్చిలో, సూటులో, అధికారస్థానంలో, కూర్చోని వుంది.

ఆనందంవైపు చూస్తుంటే ఏసురాంలో వణుకు పెరుగుతూవుంది.

ఎటూ చూడకుండా, నిశ్చలంగా, ఫాదరీ వైపు చూస్తూ, ప్రసంగం వింటూ ఆనందంగా వున్నాడు.

చర్చిలో ఆవులింతలు ఎక్కువయ్యాయి.

ప్రసంగం ఆపమని ఏసురాం కళ్ళింకా చెప్పలేదు.

ఆ కళ్ళు ఆనందాన్ని మార్చిమార్చి చూస్తున్నాయి.

పిల్లలు చాలామంది చర్చి వెలుపలికి వచ్చారు.

యువకులు స్కూల్స్, కాలేజెస్ కబుర్లు చెప్పు కొంటున్నారు.

చిన్న చిన్న ఉద్యోగస్థులు, సినిమా సంగతులు మాట్లాడు కొంటున్నారు. పెద్దవాళ్ళు మౌనంగా కూర్చోవడంవల్ల నిద్రపడుతూ వుంటే తూలుతూ మేలు కొంటూవున్నారు.

చర్చిలో జనం అశాంతితో కదులుతుంటే ఫాదరీ ప్రసంగం ఆపేశాడు.

అదికూడా తెలియని ఏసురాం గుండెను వణుకు గృహంలోనే గస్తీ తిరుగ నిస్తున్నాడు.

ఫాదరీ పసివాళ్ళకు పేర్లు పెడుతున్నాడు.

ఆనందం కళ్ళు చెమ్మగిల్లాయి.

ఈ క్రైస్తవ జీవితాలు ఎలాసాగుతాయో!

మునుపటి లాగానా?

మెరుగ్గానా?

తరుగ్గానా?

ఆనందం కళ్ళుతుడుచు కొన్నాడు.

ఆనందం కళ్ళు తుడుచు కొంటుంటే ఏసురాం తనబేంకు దివాళా తీసినట్లు బాధ పడ్డాడు.

"సంతోషముతో నిచ్చెడు వారలనెంతో దేవుడు ప్రేమించున్" పాట ప్రారంభమయింది.

చందా పట్టేసంచులున్న కర్రలు పట్టుకొని ఫాదర్ ముందుకు వచ్చాడు.

నలుగురు చర్చి పెద్దలు లేచి నిలబడ్డారు.

ఆనందం కూడా లేచాడు.

నలుగురూ ముందుకు వెళ్ళారు. ఆనందం కూడా వెళ్ళాడు.

నాలుగే చందా సంచులు ఐదుగురు పెద్దలు. అందులో ఆనందం యువకుడు.

క్రైస్తవ భక్తులు వేసే చందావసూలు చేయడానికి చర్చి పెద్దలు సిద్ధమవుతున్నారు.

అదొక గౌరవం! హోదా!

ఎప్పుడయినా, ఏ పెద్ద అయినా రాకపోతే తరువాత వాళ్ళు వసూలు చేస్తారు.

కానీ ఏకొత్త మనిషో ఆపని చేయటానికి వీలులేదు.

'ఎవరు నీవు?'

ఏసురాం అడిగాడు. ఇదే ప్రశ్న నిన్నటినుంచి అతడి తలకాయకు కన్నం వేస్తూఉంది.

'ఈ మిషన్ క్రైస్తవుణ్ణి!' ఆనందం జవాబు.

'ఈ చర్చిలో!'

'మీవాణ్ణి'

'అంటే' ఏసురాం రెట్టించాడు.

"మీవారసుణ్ణి" ఆనందం నెమ్మదిగా చెప్పాడు.

ఏసురాం వినలేక పోయాడు.

చందాసంచి లాక్కున్నాడు.

ఆనందం వదల్లేదు.

బలంగా లాగి, పడబోయి, నిలదొక్కుకొని, చేయి ఎత్తి, చాచి చెంపమీద కొట్టాడు.

ఆనందం ఆనందంగా నవ్వాడు.

'ఒక చెంపమీద కొడితే, రెండో చెంప చూపమని ఏసుప్రభువు చెప్పాడు' అన్నాడు.

రెండో చెంప ఛెళ్ళుమంది.

చర్చి అంతా అల్లకల్లోలంగా అయిపోయింది.

'ఇప్పుడు?' ఏసురాం ప్రశ్నించాడు.

'ఎప్పుడూ రెండో చెంప ఖాళీగా వుంటుంది'.

ఏసురాం వినలేకపోయాడు. వినబడిం తర్వాత నిలబడలేకపోయాడు. ఊగిపోయాడు. చేతులూ ఊగిపోతున్నాయి. రెండూ లేచాయి. ఒకేసారి ఆనందం చెంపలు ఛెళ్ళుమన్నాయి.

ఆనందం సంతోషంగా నవ్వాడు. కళ్ళలో నీళ్ళు!

'ఇప్పుడ్రా' ఏసురాం పిచ్చివాడయిపోతున్నాడు.

'రెండు చెంపలూ ఖాళీగా వున్నాయి'.

జనం ముందుకు వచ్చారు.

''ఎవరు నువ్వు? ఎవరితడు? ఏమయింది? ఎందుకు కొట్లాట?'' గోల! అరుపులు! రద్దీ! తోసుకుంటున్నారు.

''ఉంటాయి,'' ఉంటాయి, ఏసురాం అరుస్తున్నాడు. 'దరిద్రపు వెధవా!' తిడుతున్నాడు. 'నా మీదికి వస్తావంటరా' కోప పడుతున్నాడు.

మళ్ళీ కొట్టబోయాడు.

ఆనందం రెండు చేతులూ పట్టుకొన్నాడు. చందా సంచి, కర్ర నేలమీద పడింది.

'నా చెంపలకేం ఫర్వాలేదు. నీ చేతులకే నొప్పి!'

ఈ మాటలు అసలు భరించలేకపోయాడు.

క్రింద పడ్డ చందా సంచి కర్ర తీసుకొని చాచి నెత్తిమీద ఒక్కటే దెబ్బ కొట్టాడు.

తల చిట్లింది. రక్తం చింది చందా సంచిలో పడింది.

ఆనందం ఏమీ అనలేదు. ఏడవలేదు.

ఎవరో వచ్చి అతన్ని పట్టుకొన్నారు. హాస్పటల్‌కి పోదామన్నారు.

ఆనందం వద్దన్నాడు.

ఏసురాంని ఎవరో పట్టుకొన్నారు. కూర్చోబెట్టారు. 'తప్పు' అన్నారు. 'మంచి పనిచేశావు' అన్నారు. 'ఈ వయస్సులో కోపం రాకూడ'దన్నారు.

ఏసురాం 'చందాపట్టండి' అన్నాడు. చందా పడుతున్నారు.

'దశమ భాగము లెల్లా దేవునివి ధారాళము నీయ సమకూడుడీ'.

చిల్లర, రూపాయలు, రెళ్ళు, అయిదులు, పదులు నోట్లు చందా సంచుల్లో పడుతున్నాయి.

చర్చి అనే సంచిలో ఆనందం రక్తం చందా పడుతూనేవుంది.

'పదోవంతు'.

పాడుతూ పాడుతూ ఫాదర్ 'ఏసుప్రభూ! ఈ యువకుణ్ణి రక్షించు! నీ సిలువలో నీ సేవలో వాడుకో!' ప్రార్థించాడు.

చర్చిలో జనం మౌనంగా యువకుడి ఆరోగ్యం కోరుకుంటున్నారు.

చందా పట్టటం అయిపోయింది. ప్రార్థన చేస్తున్నాడు ఫాదర్. అందరూ తలలు వంచుకొన్నారు.

ప్రార్థన ముగిసి చూస్తే ఆనందం అక్కడ లేడు.

ఏసురాం ముఖంనిండా ఆనందం.

ఆనందం వెలుపల ఉన్నాడు.

అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు చెబుతున్నాడు.

పేరు చెప్పటం తప్పు, ఊరు చెప్పటంలేదు.

రక్తం తుడుస్తుంటే వద్దనటం లేదు.

జాలి పడుతుంటే కాదనటంలేదు.

తాను మాత్రం క్రిస్మస్ శుభాకాంక్షలు చెబుతూనే వున్నాడు.

చేతులు పట్టుకొంటున్నాడు.

షేక్‌హాండ్స్ ఇస్తున్నాడు.

బొంగరంలాగా, బంతిలాగా, చుక్కలాగా, సూర్యుడులాగా, భూగోళం లాగా తిరుగుతున్నాడు.

ఏసురాం వెలుపలికి వస్తుంటే ఎదురుగాపోయి చేయి పట్టుకొని, చాలనంచేసి నమస్కరించాడు.

జనం బిత్తరపోయి చూస్తున్నారు.

ఏసురాం చేయి విసురుగా లాక్కున్నాడు.

గిర్రున వెనక్కు తిరిగాడు.

పోతూ పోతూ ఆగి, మళ్ళీ వెనుతిరిగి ఆనందంవైపు చూశాడు.

ఏసురాం వణకటంలేదు.

కుడిచేయి ఎత్తి ఆనందం తలమీద పగిలినచోట పెట్టాడు. తడిమాడు. వణికాడు.

ఏసురాం కళ్ళు ఎక్కడో చూస్తున్నాయి. కళ్ళలో నీళ్ళు.

చర్చిలోంచి అందరూ వచ్చేశారు.

'వస్తున్నా ప్రభూ!' ఆనందం అరుచుకొంటూ చర్చి గేటు వైపు పోయాడు. అక్కడే ఆగి "ఏసుప్రభూ! మళ్ళీ పుట్టావా?" అన్నాడు.

ఆనందం ఎదురుగా ఎవరూ లేరు.

"చర్చికి వచ్చావా?"

సమాధానం లేదు.

"చర్చి లోంచి ఈ రోజు వెలుపలికి వస్తున్నావు కాబట్టి ఏసుప్రభూ! నీకు నా క్రిస్మస్ శుభాకాంక్షలు".

ఆనందం కరచాలనం చేస్తున్నాడు.

ఎదురుగా ఎవరూ కనిపించటం లేదు.

చర్చి గంటలు మోగుతున్నాయి.